క్లుప్తంగా

వేతనదారులందరికీ ఉపాధి పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలోని అర్హత ఉన్న వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అన్నారు. కొత్తవలస చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొత్తవలసలో 170 మంది వేతనదారులకు పని కావాల్సి ఉండగా 154 మంది పనులకు హాజరవుతున్నారని చెప్పారు. ఫారం పాండ్స్, ట్రెంచ్ కటింగ్, లింక్ రోడ్ల అభివృద్ధి, తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్, సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు ప్రాధాన్యం

- ఈఓపీఆర్‌డీ కుమారవర్మ



చెత్తసేకరణను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కుమారవర్మ

సీతానగరం: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ కె. కుమారవర్మ తెలిపారు. మండలంలోని చిన్నారాయుడుపేట, మరిపివలస, సూరంపేట గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కార్యదర్శి మురళిని ఆదేశించారు. తడి, పొడి చెత్తను ఇంటికి వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందివ్వాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సూరంపేట సర్పంచ్ సీహెచ్ అప్పన్నమ్మ, మాజీ సర్పంచ్ సీహెచ్ సాంబందొర, ఉపసర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుపై 5 శాతం రాయితీ



సీహెచ్ వెంకటేశ్వర్లు, కమిషనర్

పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ఒకేసారి చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బకాయి పన్నులు కూడా ఏప్రిల్ 30లోగా చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి, కుళాయి, ఖాళీస్థలం పన్నులను మున్సిపల్ కార్యాలయంలో గాని, సచివాయంలో గాని చెల్లించాలని కోరారు.

వేతన సవరణ సంఘం నియమించాలి



ఎ. సూర్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం వేతన సవరణ సంఘం నియమించి మంచి ప్రభుత్వం అని పించుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కూటమి నాయకులు అధికారంలోకి వస్తే పీఆర్‌సీ కమిషన్ వేయడంతో పాటు సముచితమైన ఐఆర్ ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

నేడే రాములోరి కల్యాణం



ఎమ్మార్‌నగరం గ్రామంలో పూజలందుకుంటున్న విగ్రహమూర్తులు


పార్వతీపురం రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాములోరి కల్యాణం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, కమిటీ పెద్దలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాలు, రామమందిరాలు, చలువ పందిళ్లను విద్యుత్ దీపాలు, పూలతో అందంగా ముస్తాబు చేశారు. అలాగే ఉత్సవమూర్తులను వివాహ వేడుకలకు సిద్ధం చేశారు.

గ్రామాల్లో దాహం కేకలు

- మూలకు చేరిన రక్షిత మంచినీటి పథకాలు
- బావుల నీరే గతి
- పట్టించుకోని అధికారులు



తుమరాడలో అలంకారప్రాయంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్



గంగాడ గ్రామం



బావికి గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్లు



అలంకారప్రాయంగా ఉన్న వీధి కుళాయి పాయింట్

బలిజిపేట: మండలంలోని గంగాడ, తుమరాడ, బర్లి గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. చాలా రోజుల నుంచి ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్దిరోజుల కిందట తుమరాడ, బర్లి గ్రామాల్లో మహిళలు నిరసన ప్రదర్శనలు జరిపినా అధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు మండిపడుతున్నారు. గంగాడలోని రక్షిత మంచినీటి పథకం మూలకు చేరి నెల రోజులైంది. దీంతో గ్రామంలో ఉండే బావులు, వీధి బోర్ల నీటినే తాగుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా రక్షిత మంచినీటి పథకం నుంచి తాగునీరు సరఫరా కాకపోయినా ఇంతవరకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరం. బోరుబావుల నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఉన్న బావికి సమీపంలో ఉన్న వారు మోటార్లు బిగించడంతో కొద్ది నీరు కూడా దొరకడం లేదని వాపోతున్నారు.వేసవి పూర్తిస్థాయిలో రాకముందే తాగునీటి కష్టాలు ప్రారంభమైతే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటోందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుమరాడ, బర్లిలో కూడా తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తగు చర్యలు చేపడతాం..

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తగు సూచనలు, సలహాలు అందించాం. క్రాస్‌ప్రోగ్రాంలో భాగంగా పాడైన బోరుబావులకు మరమ్మతులు చేయిస్తున్నాం.

– ఏవీఎస్ నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

ఇబ్బంది పడుతున్నాం..

తాగునీటికి కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఫలితం లేకపోయింది. గతంలో గ్రామంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు అందించాలి.

– జి.లక్ష్మి, గ్రామస్తురాలు, తుమరాడ

ఓవర్ హెడ్ ట్యాంక్ క్లీనింగ్

సీతానగరం:

మండలంలోని పెదబోగిలి మేజర్ పంచాయతీలో వేలాది మంది ప్రజలకు నిరంతరం తాగునీరు సరఫచేస్తున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌ను శనివారం శుభ్రపరిచారు. సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ట్యాంక్‌ను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేపట్టారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు, తదితరులు

సాలూరు: విద్యుత్ వినియోగదారులపై భారం మోపే స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని సీపీఎం పట్టణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. విద్యుత్ ధరలు తగ్గించాలి.. అంటూ రూపొందించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు శంకర్, రాముడు, ఈశ్వరరావు మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. ట్రూఅప్ చార్జీల పేరిట వినియోగదారుల మీద రూ. 17 వేల కోట్ల భారం వేశారన్నారు. వెంటనే విద్యుత్ ధరలు తగ్గించడంతో పాటు స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలరాజు, శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల భద్రతకు చర్యలు

- రూరల్ ఎస్సై సంతోషికుమారి



సంగంవలస గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: ఆలయాలు, ప్రార్థనా మందిరాల భద్రతకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి తెలిపారు. ఈ మేరకు మండలంలోని సంగంవలస, ఎమ్మార్‌నగరం, చినబొండపల్లి, తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద శనివారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతరం సంగంవలసలో ప్రజలతో మాట్లాడుతూ.. ఆలయాల వద్ద ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నేరాలు జరిగితే నిందితులను సులువుగా గుర్తించవచ్చన్నారు. అలాగే ముఖ్య కూడళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సీపీఎం కార్యాలయం ప్రారంభం..



పార్వతీపురం మండలం వెలగవలస పంచాయతీ ములగవలస గ్రామంలో సీపీఎం కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి పోరాట మార్గమే సరైనదని చెప్పారు. కార్యక్రమంలో పి.రాము, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

– పార్వతీపురం రూరల్



నరసింహచెరువు ఆయకట్టు స్థితిగతులు

పాలకొండ రూరల్: మండలంలోని పీఆర్.రాజుపేట గ్రామ పరిధిలోగల నరసింహ చెరువు ఆక్రమణలను గుర్తించేందుకు రెవెన్యూశాఖాధికారుల సమన్వంతో తక్షణ చర్యలు చేపడతామని జలవనరుల శాఖ పాలకొండ డివిజన్ జేఈఈ కార్తీక్ అన్నారు. ఇటీవల అదే గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు చేసిన ఫిర్యాదు మేరకు నరసింహ చెరువును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరసింహ చెరు వు నుంచి ఓని, పాలకొండ రోడ్డు వరకు గల ఇరిగేషన్ కాలువ కొలతలు సేకరించామన్నారు. ఈ చెరు వు దిగువభాగంలో గల పద్మనాభకోనేరు ద్వారా పాలకొండ ప్రాంత రైతులకు సాగునీరు అందించే మధుములు శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జేఈఈ వెంట ఐజీ భుజంగరావు, అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు ఉన్నారు.

ఉపవాస ప్రార్థనలు..



బెలగాం చర్చివీధుల్లో ఉన్న పునీత కార్మిక జోజప్ప దేవాలయంలో క్రైస్తవ విశ్వాసులు శనివారం ఉపవాస ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫాదర్ కె. తోమస్‌రెడ్డి నేతృత్వంలో ఎర్రసామంతవలస నుంచి వచ్చిన ఫాదర్ పి. జీవన్‌బాబు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

– పార్వతీపురం

నివాళి..



ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మామిడి రామారావు చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బలిజిపేట మండలం గళావిల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆమె పాల్గొని, రామారావు సేవలను కొనియాడారు.

– పార్వతీపురం రూరల్

తాటి ముంజులొచ్చాయ్..



వేసవి దాహార్తిని అరికట్టడంలో తాటిముంజులు ఎంతగానో ఉపకరిస్తాయి. ప్రస్తుతం ఎండలు విజృంభిస్తుండడంతో ముఖ్య కూడళ్ల వద్ద తాటిముంజులు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సమీప గ్రామాల రైతులు తాటికాయలు తీసుకువచ్చి 12 ముంజులు 50 రూపాయలకు విక్రయిస్తుండడంతో ప్రజలు ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు.

– పార్వతీపురం రూరల్

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



పార్వతీపురం: బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



సాలూరు: జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి



పార్వతీపురం టౌన్: జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, ఎమ్మెల్యే విజయ చంద్ర

పార్వతీపురం: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. జగ్జీవన్‌రామ్ 118వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ గొప్ప పరిపాలనాదక్షుడని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, అణగారిన వర్గాలకు ప్రత్యేక హక్కులు ఉండాలని పోరాడని ధీరుడన్నారు. ఆహార శాఖా మంత్రిగా పనిచేసిన సమయంలో హరిత విప్లవం తీసుకు వచ్చారని తెలిపారు. రక్షణశాఖ మంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన పాకిస్తాన్ యుద్ధంలో బంగ్లాదేశ్ ఏర్పాటుకు కారకుడని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ మురళీధర్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశాజ్యోతి..

పార్వతీపురం టౌన్: బాబూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల ఆశాజ్యోతని స్థానిక శాసనసభ్యుడు బోనెల విజయచంద్ర అన్నారు. ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి స్థానికంగా ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి ఎం.డీ గయాజుద్దీన్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, బలిజిపేట మండలం ఎంఈఓఎ ఎస్.సింహాచలం, మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు జి.గంగారాజు, ప్రెసిడెంట్ కె. సల్మాన్, సెక్రటరీ బి.రవికుమార్, రాష్ట్ర నాయకుడు పి. నారాయణరావు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జి.ప్రభాకరరావు, సభ్యులు ఎన్.ప్రసాద్, ఆర్. వినయ్, కె.మోస, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కరణల యోధుడు..

పార్వతీపురం రూరల్: బాబూ జగ్జీవన్‌రామ్ సంస్కరణల యోధుడని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి అన్నారు. పోలీస్‌శాఖ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వలసవాదం, సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. అతి చిన్న వయసులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా, దేశ ఉప ప్రధానిగా సేవలందించారన్నారు.

మనందరి అదృష్టం..

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేసుకోవడం మనందరి అదృష్టమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...55 సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా సమాజానికి ఎనలేని సేవలు అందించారని చెప్పారు.

నివాళులు..

సాలూరు: మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతిలో స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘ సంస్కర్తగా ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, అధికారులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ..

బలిజిపేట: మండల కేంద్రంలోని చెరువు గట్టుపై జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడని కొనియాడారు. అనంతరం 150 మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాఘలత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, పి.మురళీకృష్ణ, డాక్టర్ బి.కాశినాయుడు, ఎన్‌వీ జగన్నాథం, పి.హరిప్రసాద్, వి.రవి, పీఎస్ఆర్ నాయుడు, టి.ప్రసాదరావు, వాసుదేవరావు, పి.నారాయణరావు, పి.రామకృష్ణ, జి.పకీరునాయుడు, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



బలిజిపేట: జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన నాయకులు, పెద్దలు